## విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు

ప్రజాపక్షం/బొమ్మలరామారం : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టి కేంద్రాల్లో 'ప్రజా పక్షం' జాతీయ దినపత్రిలో వచ్చిన 'బట్టిలో మగ్గుతున్న బాల్యం'పై స్పందించిన అధికారులు మండల కేంద్రంలోని అన్ని బట్టిల్లో పర్యటించి విద్యా ర్థులను పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు మాట్లా డుతూ ఇలాంటి సమస్యలను వెలికి తీసి చిన్నారులను పాఠశాలల్లో చేర్పించినం దుకు 'ప్రజాపక్షం' దినపత్రిక, అధికారు లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్





# ప్రజాపక్షం
# జిల్లా అనుబంధం
## నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 06 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 07


# ఇంట్లో నుంచే ఫర్టిలైజర్ యాప్‌తో యూరియా

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ యూరియా యాప్ ద్వారా రైతులు కూర్చొన్న చోట నుంచే యూరియా పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలం లోని కొత్తగూడెం గ్రామంలో ప్రభుత్వ భూములను పరిశీలించడానికి వచ్చిన ఆయన రైతులతకు యూరియాపై అవగాహన కల్పించారు. యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకున్న రైతులు సులభంగా యూరియాను పొందే అవకాశం ఉందని గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పని లేదన్నారు. అందువల్ల రైతులందరు ఫర్టిలైజర్ యూరియా యాప్‌ను సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కాగా రైతులు తమకు యూరియా యాప్ ద్వారా ఓటీపీల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, యూరి యాను అన్ని దుకాణాల్లోనే అందించాలని కోరగా స్పందించిన కలెక్టర్ గు ర్తించిన డీలర్ల వద్ద యూరియాను స్టాక్ ఉంచడం జరిగిందని, యూరి యా కోసం రైతులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం యూరియా యాప్‌ను తీసుకొచ్చిందని, దీని ద్వారా రైతులు సులువుగా యూరియా పొందవచ్చని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వ భూములను పరిరక్షించాలి**

చట్ట ప్రకారం ప్రభుత్వ భూములను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ చంద్రశే ఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన భూభారతి కేసుల పరి ష్కారంలో భాగంగా మండలంలోని కొత్తగూడెం గ్రామం శివారులోగల ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. మండలంలో ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములపై తహసీల్దార్‌తో విచారించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులు, కౌలు రైతులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి కింద వచ్చిన దరఖా స్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్



ప్రజాపక్షం/రామన్నపేట : విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆక స్మికంగా తనిఖీ నిర్వహించారు. ఓపి విభాగమును, వార్డులలో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌లను పరిశీలించి అనుమతులు లేకుండా గైర్హాజరైన ముగ్గురు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారి చేస్తున్నట్లు తెలిపారు. వైద్యు లతో సమావేశమై ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు అందిస్తున్న మందులపై ఆరాతీశారు. మందుల నిల్వలను పరిశీలించారు. అత్యవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని అన్నారు. స్థానిక నాయకులు ఆయనను కలిసి ఆసుపత్రి భవనం శిథిల దశకు చేరుకుందని, నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని ఆయ నను కోరారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, పరిశీలనలో ఉందని ఆయన వారికి తెలిపారు. ఆయన వెంట డిసిహెచ్ఎస్ చిన్నా నాయక్, వైద్యులు స్వాతి బాయి, నవీన్ సింగ్, మాధవచారి, దేవేందర్, సుమంగళి, హెడ్ నర్సులు సువర్ణ, సోలి, జ్యోతి, నర్సింగ్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) : ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పిం చాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం తిరుమలగిరి ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి బిఎల్ఓ, ఆర్ఓ, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, జోనల్ ఆఫీసర్‌లతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు అవగాహన, పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కల్పించవల్సిన మౌళిక సదు పాయాల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్ని కల విధులు నిర్వహించు ప్రతి అధికారి ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటిస్తూ, ఎన్నికల కమీషన్ ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బం దికి, ఓటర్లకు లైట్లు, ఫ్యాన్లు, కుర్చీలు, టాయిలెట్స్ వంటి మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిసి కెమెరాలతో మానిటరింగ్ ఏర్పాటు చేయాలని సూచిం చారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వికలాంగులు, వయోవృ ద్ధులు, నడవలేని వారికి వీల్‌చైర్ ఏర్పాటు చేయాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్లో వెలుతురు సరిగ్గా ఉండే విధంగా లైట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రదేశంలో 100 మీటర్ల డిస్టెన్స్ పాటించాలని మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులకు అధికారులు ఎన్నికల కమీషన్ నిబంధనలు వివరించాలని అన్నారు. అనంతరం తిరుమల గిరిలో పోలింగ్ స్టేషన్లను, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సంద ర్శించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్‌డిఓ వేణు మాధవ్, మున్సిపల్ కమీషనర్ సంపత్ పాల్గొన్నారు.




**ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ**

ప్రజాపక్షం/అర్వపల్లి (నాగారం) : నాగారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ఎరువుల దుకా ణాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. షాపులో నిల్వ ఉన్న యూరియా బస్తాలు, ఇతర ఎరువుల వివరాలను ఏఓ కృష్ణకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు 430 యూరియా నిల్వలు ఉన్నట్లుగా నమోదు చేయడం గమనిం చిన ఆయన యూరియా నిల్వలు స్వయంగా పరిశీలిం చారు. కొనుగోలు యాప్ ద్వారా రైతులకు యూరియా కొనుగోలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ యాప్ వల్ల రైతులకు లాభదాయకంగా ఉందా లేదా అలాగే యూరియా సరఫరా గురించి డీలర్ ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఎరువులు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు.

**నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) : ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో రూ.200 కోట్లతో 2000 ఎక రాలలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సంబంధిత గుత్తేదా రుకు భవన నిర్మాణ పనులు నాణ్యతతో ఎక్కడా రాజీపడ కుండా పనులు చేయాలని అవసరమైతే ఎక్కువ మంది పని వారిని పెట్టి భవనాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. నిర్మాణ పనులు వేగవం తంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవ్, ఎంపి డిఓ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## దిలీప్ రెడ్డి గెలుపుకు కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని 31వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండపల్లి దిలీప్ రెడ్డి విజయం కొరకు కృషి చేయాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్యలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్‌లో బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన 31వ వార్డు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జావేద్ బేగ్, వెన్న శ్రీనివాస్ రెడ్డి, తాడూరి లింగయ్య, కనుకు ప్రవీణ్, కమటం వెంకట్ రెడ్డి, అలీ, రవితేజ, నర్సి, లింగారెడ్డి పాల్గొన్నారు.

## దోమలమందు పిచికారి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే దృడ సంకల్పంతో, వ్యాధులను అరికట్టేందుకు దోమలు మందు పిచికారి చేస్తున్నట్లు సర్పంచ్ చెన్నగాని సాంబయ్య అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని వెలిదండ గ్రామంలో దోమల మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైన వేదశ్రీ



**ప్రజాపక్షం/మునగాల:** కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సిఎం కప్ చెస్ విభాగంలో నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా స్థాయి పోటీలకు మునగాల మండలంలోని ట్రినిటి పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న బంగారపు వేదశ్రీ ఎంపికైనట్లు ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్, మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, పిడి ఎస్‌కె అన్జామ్ లు తెలిపారు. ఈ సందర్భంగా వేదశ్రీని పాఠశాల ప్రిన్సిపాల్ జాకబ్‌రాజు, కరస్పాండెంట్ వనజ, ఉపాధ్యాయులు అభినందించారు.

## 44వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతాం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 44వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని సూర్యాపేట మున్సిపాలిటి 44వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గునగంటి హేమ సతీష్ అన్నారు. గురువారం ఆ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ఓటర్లను కలుస్తూ హస్తం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాసేవ చేసినందుకే తాము రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్రార్ అహ్మద్, మన్సూర్ అలీ, పోల సాయి, సోహెల్, నాగరాజు, రమేష్ నాయక్, శబరి, లింగయ్య పాల్గొన్నారు.



## పోలీసు వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ నందు పోలీసు వాహనాలు నడుపుతున్న సిబ్బంది వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డ్రైవర్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి సఫారీ యూనిఫామ్స్ అందజేసి మాట్లాడారు. వాహనాలు నాణ్యత వచ్చేలా నిర్వహణ చేయాలన్నారు. పౌరులకు పోలీసు సేవలు అందించడంలో పోలీసు వారిని సంఘటన స్థలాలకు, బాధితుల వద్దకు చేర్చడంలో వాహనాలు, డ్రైవర్ సిబ్బంది కీలక విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. సిబ్బంది క్రమశిక్షణ సమయపాలనతో పనిచేయాలని, వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు రక్షణ చర్యలు పాటించాలని కోరారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నారాయణ రాజు, ప్రవీణ్ కుమార్, పోలీసు మోటార్ ట్రాన్స్పోర్ట్ ఆర్ఎస్ఐ సురేష్, పోలీసు సంక్షేమ ఆర్ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సహజ కాన్పులు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యందు సహజ కాన్పులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ భూక్య నగేష్ నాయక్ తెలిపారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష నిర్వహించుకొని సహజ కాన్పుకై ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళ వ్యాయామం చేయాలని సూచించారు. సహజ కాన్పు ద్వారా మహిళలకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఆపరేషన్ అయిన వారు భవిష్యత్తులో నొప్పులు, అనారోగ్యాల బారినపడే అవకాశం ఎక్కువగా ఉన్నందున సహజ కాన్పుకై ప్రయత్నం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఈ సంవత్సర కాలంలో 20 సహజ కాన్పులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సేవలను గర్భిణీ, బాలింతలు వినియోగించుకోవాలని కోరారు. మాలోతు బిచ్చునాయక్, కలమ్మ, అనూష పాల్గొన్నారు.

## మహిళ న్యాయవాది హంతకులను కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన యువ మహిళ న్యాయవాది స్వప్నను అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆమె హత్యను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ స్వప్న హత్యకాపించబడటానికి ముందు రెండుసార్లు ఆమెపై హత్యయత్నం జరిగిందని, డోజర్‌తో ఒకసారి, కారుతో మరోకసారి టక్కర్ ఇచ్చి చంపడానికి ప్రయత్నించడంతో ఆ రెండు సంఘటనల నుండి ఆమె చాక్యచాక్యంగా తప్పించుకుందని చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రెండుసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఏమాత్రం స్పందించలేదన్నారు. సరైన సమయానికి సరైన విధంగా పోలీసులు స్పందించి ఉంటే స్వప్న హత్య కావించబడకపోయేదని అన్నారు. స్వప్న హంతకులతో పాటుగా విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై కూడా తగు శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరుతూ న్యాయవాదులు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన్, ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ఇన్‌ఛార్జి రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మి శారద లకు బార్ అసోసియేషన్ తీర్మాణ కాపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, చెనగాని యాదగిరి, చక్రాల వెంకటేశ్వర్లు, కొట్టు సురేష్, కమతం నాగార్జున, పిడమర్తి చంద్రయ్య, శ్రీనునాయక్, నాగరాజు నాయక్, పాలేటి శ్రీనివాసరావు, రమణారెడ్డి, రామారావు, నాగపాషా, అడవిరాముడు, సాయిరాం, బ్రహ్మచారి పాల్గొన్నారు.

## ఎన్నికల విధులను అప్రమత్తతో నిర్వహించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్నికల విధులను మరింత అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారి గాజర్ల రమేష్ అన్నారు. పట్టణంలోని మినీ రవీంద్రభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా చదివి పాటించాలని సూచించారు. పోటీలు ఉన్న అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ప్రతి ఓటరు ఎలాంటి ఇబ్బంది లేకుండా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సుల సంరక్షణ, సీల్ చేసే విధానం, డైరీ, డిక్లరేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలో ఓటు కలిగి ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ కోరారు. సంబంధిత దరఖాస్తును నింపి, ఓటరు ఐడి కార్డు డ్యూటీ ఆర్డర్ కాపీని జత చేసి అంబేద్కర్ భవన్‌లో సమర్పించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌ను నేటి నుంచి 9వ తేదీ వరకు అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ గణవేణి శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ బాలు, గుడిపాటి కోటయ్య, శ్రీను, సైదిరెడ్డి, శంకర్, షెహబాజ్ పాల్గొన్నారు.



## అభివృద్ధి చేస్తా ఆదరించండి

**ప్రజాపక్షం/కోదాడ:** గత 50 సంవత్సరాలుగా ఈ వార్డు పరిధిలోనే మా కుటుంబం జీవనం గడుపుతుందని, ఇక్కడే పుట్టి పెరిగానని, ఇక్కడి సమస్యలన్ని తెలుసుకుని వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గెలిపించాలని 24వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చలపాటి శివకృష్ణ గెలుపును ఆకాంక్షిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ఆ వార్డు ముఖ్య నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. వార్డు ఇన్‌చార్జి, మాజీ ఎంపిటిసి అంబటి కర్ర శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్ చిరు సంఘం అధ్యక్షులు వీరస్వామి పాల్గొన్నారు.

## స్పర్శ కుష్ఠువ్యాధిపై అవగాహన



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వివక్షతను అంతం చేయడం, గౌరవాన్ని కాపాడటం అనే నినాదంతో స్పర్శ కుష్ఠు వ్యాధిపై గురువారం మండల కేంద్రంలోని కెజిబివి స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చేవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్లకు చెప్పులు జారీ పోవడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, కంటి రెప్పలు వాల్చలేకపోవడం, చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం ఏమైనా లక్షణాలు ఉంటే స్థానిక ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లయితే వారికి ఎండిటి విధానం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఎస్ఓ శైలజ, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు కవిత, అంజలి, ఆశా ఉమా పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఆర్థిక మోసాలకు చెక్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** బ్యాంకుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతోనే ఆర్థిక మోసాలపై చెకు పెట్టవచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గౌడ వెంకటేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కోనాయిగూడెం, వెలిదండ గ్రామాల్లో ఆర్థిక అక్షరభ్యాసంపై కళాజాతర బృందం ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాత ప్రదర్శన కళాకారులు విభూతి శ్రీనివాసరాజు, విప్పా ఏడుకొండలు, ప్రదర్శించిన మ్యాజిక్ షో జానపద గీతాలుప్రజలను నవ్విస్తూ ప్రధానమంత్రి జీవన జ్యోతి, భీమా ప్రధానమంత్రి సురక్ష పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** అర్వపల్లి శ్రీయోగానంద లక్ష్మి నృసింహస్వామి బ్రహోత్సవాలను పురస్కరించుకొని దేవాలయం ఆవరణలో ఈనెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరూరి యోగానందచార్యులు, ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి అన్నారు. క్రీడా పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, చతుర్థి బహుమతి రూ.15వేలు, పంచమ బహుమతిని రూ.10వేలు అందజేయనున్నట్లు వివరించారు. ఈ క్రీడాపోటీలో పాల్గొనవలసిన వారు ముందస్తుగా 9390146292, 8074373955, 8790441238, 95028609974 ఫోన్ నంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## కోదండరాం ,అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియమాకమును ఆమోదించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గవర్నర్ కోటాలో కొత్తగా చేపట్టబోయే ఎమ్మెల్సీ నియామకాలకు గత సుప్రీంకోర్టు ఆదేశాలు అడ్డంకులు కాదని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.గత ఏడాది ఆగస్టు 13 నాటి మధ్యంత ఉత్తర్వులోనే ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పామని క్యాబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. ఇందులో ఎలాంటి ఆందోళన అవసరం లేదని నిన్న సుప్రీంకోర్టు క్లారిటీ ఇచ్చినందున ఆచార్య కోదండరాం,అజారుద్దీన్ పేర్లను మంత్రివర్గము ఆమోదించి గవర్నర్‌కు పంపించియున్నందున గవర్నర్ వారి పేర్లను ఆమోదించి గెజిట్ ప్రకటించవలసినదిగా జిల్లా తెలంగాణ జన సమితి అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శిలు పన్నాల గోపాల్ రెడ్డి నారబోయిన నాగేశ్వర రావు యాదవ్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

## తండ్రి బాటలో పయనిస్తున్న డాక్టర్ అరుణ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీలకు రాజ్యాధికార దిశగా 50 సంవత్సరాలు గా ఉద్యమాన్ని నడిపిస్తున్న ఆర్ కృష్ణయ్య బాటలో తనయుడు డాక్టర్ అరుణ్ పయనిస్తూ బీసీలను చైతన్యం చేస్తున్నాడని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దు డుకు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శి గుండే వెంకటేశ్వర్లు,బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలీ వేణు,బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పదవ డివిజన్ కార్పొరేట్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే డివిజన్‌ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని నందికొండ శ్రీనివాస్ అన్నారు.గురువారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పదవ డివిజన్లో బిఆర్ఎస్ బలపరిచిన నందికొండ శ్రీనివాస్ విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రామ్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, అనంత నాగరాజు, గోన హనుమంతరావు,జూపల్లిసైదులు, పోలేపల్లి శంకర్,రామేశ్వరి,అయిత రాజు మంగమ్మ,నందికొండ సైదులు,బొడ్డు శ్రీనివాసు, జ్యోతి,శోభ,కళ్యాణి,రాణి, పద్మ పాల్గొన్నారు.

## రాంరెడ్డి మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలం కొత్తవారిగూడెం గ్రామానికి చెందిన రైతు షాబాద్ రాంరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్ద పనిచేస్తుండగాప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందారు.ఈ సంఘటన నేపథ్యంలో గురువారం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రాంరెడ్డి మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ సందర్శించిని వాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ పర్యావరణ వేత్త సురేష్ గుప్త అన్నారు.గురువారం నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఎకో క్లబ్, వృక్షశాస్త్ర విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తల్లి చెట్టు పూజ ఘనంగా జరిగింది.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురేష్ గుప్త పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అంటే కేవలం మొక్కలు పెంచడమనే దురభిప్రాయమున్నదని కానీ మొక్కలు పెంచడంతోపాటు మన జీవన విధానం కూడా పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా ఉన్నపుడే అది పర్యావరణ పరిరక్షణగా పిలవబడుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ కళాశాల విద్య కమీషనర్ ఆదేశాల మేరకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ యో చేసుకున్న ఒప్పందం ప్రకారం కళాశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కోటయ్య,వెంకట్ రెడ్డి,సావిత్రి,వృక్షశాస్త్ర విభాగం అధ్యక్షులు శివరాణి, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## అవినీతిలో బిఆర్ఎస్‌ని మించిపోయింది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో బిఆర్ఎస్ ని మించి పోయిందని, రేవంత్ రెడ్డి లాంటి అసమర్థ ముఖ్యమంత్రిని తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని మాజీ ఎమ్మెల్సీ,రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు.గురువారం నలగొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 15 మంది అభ్యర్థులు తమ పార్టీ నుండి పోటీ చేస్తున్నారని,ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.లక్ష్యం కోసం లక్ష సైనికుల పేరుతో మా యువజన విభాగం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఎల్‌డి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి,యువత అధ్యకుడు రాజ్ కుమార్ రెడ్డి,మీడియా కోఆర్డినేటర్ గౌర చీరప్ప,రాష్ట్ర ట్రెజరర్ గిరి కుండే, జిల్లా అధ్యకుడు జానయ్య పాల్గొన్నారు.

## విద్యా, క్రీడలు భవిష్యత్తుకు పునాదులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరిస్తేనే సమగ్ర అభివృద్ధిసాధ్యమవుతుందని నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగొని రజిత శ్రీనివాస్ అన్నారు.గురువారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ నకిరేకల్ నియోజకవర్గ క్రీడా పోటీల్లో బాలికల కబడ్డీ,ఖోఖో, వాలీ బాల్ పోటీల్లో విజయం సాధించినవారికిబహుమతుల ప్రదానోత్సవకార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్,నకిరేకల్,కేతేపల్లిఎంపీడీవోలు వెంకటేశ్వరరావు,నాగలక్ష్మి,ఎంఈఓ మేక నాగయ్య, క్రీడల అబ్జర్వర్ నజీరుద్దీన్ ,వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## అర్చక సేవకుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అర్చక సేవకుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సేవా సమాఖ్య సంఘం గౌరవ అధ్యక్షుడు పులి కృష్ణమూర్తి అన్నారు. నియోజకవర్గ బ్రాహ్మణ, పురోహిత, అర్చక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యమైనా, నిర్యాణమైనా అర్చక పురోహితుల సేవలు అవసరమని, అటువంటి సేవలను అందించే వారిని గౌరవించుకోవాలని అన్నారు. ప్రాంతాలు, భేదాలు వీడి బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండాలన్నారు. అతిథులు తంపెల్లి శంభూప్రసాద్ శర్మ, సాలూరి శివసుబ్రహ్మణ్యశర్మలు మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజాన్ని పటిష్టపరుచుకుంటూనే పౌరోహిత విద్యను విస్తరింపచేయాలన్నారు. బ్రాహ్మణ, పురోహిత, అర్చక సేవల్లోకి నూతన తరాలను ఆహ్వానించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం నూతన అధక్ష, ప్రధాన కార్యదర్శులు కురుమేటి రాధాకృష్ణ, తంగిరాల నాగేంద్రశర్మ, ఉపాధ్యక్షుడు రంయాల ఫణికుమారాచార్యులు, చిట్యాల శ్రీనివాస్, యడవెల్లి అనంతకృష్ణశర్మ, పుల్లాభట్ల లక్ష్మీ నారాయణశర్మ, దాములూరి పూర్ణయ్య, సతీష్, లోకాచార్యులు, రామ్మోహన్, ప్రసాద్, మహేష్, భరత్‌శర్మ, భవానీశం తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది హత్యకు నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మొయినాబాద్ ప్రాంతంలో యువ న్యాయవాది స్వప్న హత్యను ఖండిస్తూ గురువారం పట్టణంలోని బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించి అసోసియేషన్ నిర్ణయం మేరకు కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య మాట్లాడుతూ న్యాయవాదుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.స్వప్న హత్యకు పాల్పడిన దుండగులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి దోడా సోమయ్య, ఉపాధ్యక్షుడు పి.పాపయ్య, జాయింట్ సెక్రటరీ పి. మీరా మనోహర్,కోశాధికారి నాగరాజు,స్పోర్ట్స్ సెక్రటరీ పి. మురళీ కృష్ణ,లైబ్రరీ సెక్రటరీ వి. వెంకటరమణ పాల్గొన్నారు.



## ప్రతిపక్షాలకు ఓటేస్తే అభివృద్ధి కుంటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రతిపక్షాలకు ఓటేస్తే పట్టణ అభివృద్ధి కుంటుపడుతుందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 40వ వార్డు శాంతినగర్‌లో గురువారం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి పుర అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. గత పాలకుల వల్ల మున్సిపల్ అభివృద్ధి జరగలేదని, 48 వార్డుల సమగ్ర అభివృద్ధి తమ కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థి మిట్టపల్లి శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ వంగాల నిరంజన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మా గోడు పట్టదా మీకు

### మూడో వార్డులో మురికి గుంట - చిన్నారులకు ముప్పు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని మూసీ రోడ్డులోని మూడవ వార్డు మెయిన్ రోడ్డుపై,బాలాజీ వైన్స్ పక్కన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తొవ్వినపెద్ద మురికి గుంట ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గుంట పూర్తిగానిండిపోవడంతో మురుగు నీరు రోడ్డు వెంట పారుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులుకలిగిస్తోంది. చుట్టుపక్కల కాలనీల్లో చిన్న పిల్లలు ఎక్కువగా ఉండటంతో వారు గుంటలో పడేప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఆకాలని వాసులు జానీ పాషా,సాయి యాదగిరి,నవీన్,సైదమ్మలు మాట్లాడుతూ మురికి గుంట సమస్య అనేక సార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనివాపోయారు. మున్సిపాలిటీలో ఇతర వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నా తమ వార్డును మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరు వెళ్లేందుకు మార్గం లేక దుర్వాసనతో పాటు ఆరోగ్య సమస్యలుతలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్థ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం 12వ వార్డు ఏడుకోట్లతండాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. 12వ వార్డు అభ్యర్థి బంటు లక్ష్మీ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ధనావత్ చిట్టిబాబునాయక్, మాలోతు రాణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వైద్య పరీక్షలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** శ్రీశ్రీశ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జాజిరెడ్డిగూడెం సర్పంచ్ బింగి కృష్ణమూర్తి సూచనలతో ఉపాధి హామీ కూలీలకు బిపి, షుగర్ పరీక్షలను గురువారం సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొల్లం సైదులు, కీర్తి వెంకటేశ్వర్లు, విజయ, పల్స సైదమ్మ, పగిడిమర్రి శకుంతల, సోమగాని సైదమ్మ, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని వాసవి క్లబ్ వనిత చార్టర్ ప్రెసిడెంట్ బ్రహ్మదేవర పద్మ ఆధ్వర్యంలో గురువారం వనిత క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షురాలిగా గుండా స్రవంతి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాకోళ్ళ హైమావతి,కోశాధికారిగా బ్రహ్మదేవర స్వప్న ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దేవరశెట్టి సత్యనారాయణ,జోన్ చైర్మన్ కందగట్ల శ్వేత, పూర్వ ప్రధాన కార్యదర్శి పరిమళ పాల్గొన్నారు.

## వట్టికోట నీకు వందనాలు

**ప్రజాపక్షం/నకిరేకల్** : తెలంగాణ వైతాళికుడు,గ్రంథాలయాల నిర్మాత,ప్రముఖ రచయిత,కమ్యూనిస్టు నేత వట్టికోట అల్వార్ స్వామికి 65 వర్ధంతి సందర్భంగా మాదారం గ్రామంలో ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజ చైతన్యానికి అంకితమైన జీవితం గడిపిన ఆయన అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని ప్రజలను జాగృతం చేశారు.

## గ్రామ సంఘబంధ భవన నిర్మాణానికి భూమిపూజ



**ప్రజాపక్షం/త్రిపురారం** : మండల పరిధిలోని రాగడప గ్రామంలో పది లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ సంఘ బంధం నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ షేక్ సఫియా బేగం భూమి పూజ నిర్వహించారు.ఈసందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మహిళా సంఘాలు అతి తక్కువ వడ్డీతో రుణాలు తీసుకొని చెల్లించడం జరుగుతుందని గ్రామంలో ఉన్న మహిళ సంఘాలు సమావేశం నిర్వహించుకోవడానికి అనువుగా ప్రభుత్వం గ్రామ సంఘ భవన నిర్మాణం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శిరసన వాడ వెంకటయ్య,వార్డు మెంబర్‌లు మహేష్,బిక్షం రవి,నాగేందర్,భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నరాజు ప్రచారం

**ప్రజాపక్షం/నకిరేకల్** : నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 32వ డివిజన్ కార్పొరేటర్ బిఆర్ఎస్ అభ్యర్థి భువనగిరి ఉమారాణి దేవేందర్ మద్దతుగా గురువారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటిప్రసన్న రాజ్ ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని భారీమెజార్టీతోగెలిపించాలని కోరారు. ప్రచారంలో బిఆర్ఎస్ నాయకులు చౌగోని శంకర్,యాతకుల సోమయ్య, చెరుకు వెంకటాద్రి,మాచర్ల శంకర్ కందాల శ్రీనివాస్ రెడ్డి సోషల్ మీడియా మండలం సతీష్ ఉన్నారు.



# సాగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

**: ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి**



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, సంక్షేమ అభివృద్ధిలో సాగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామని స్థానిక ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి అన్నారు. నందికొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.సాగర్ ప్రజలు గత రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాల సమస్యపై ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పట్టాల పంపిణీకి మార్గం సుగమం చేసినందుకు ముఖ్యమంత్రి కి, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మున్సిపాలిటీని క్లీన్ స్వీప్ చేస్తాం.గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సాగర్ నియోజకవర్గంలో 75 పైగా స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ. అదే స్ఫూర్తితో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులు అదేవిధంగా హాలియా మున్సిపాలిటీలోని 12 వార్డులతో కలిపి మొత్తం 24 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు.

# పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలో నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులకు పేకటరాయుళ్లు చిక్కారు. మాదాపూర్ గ్రామం శివారులో నలుగురు నిందితులైన, భూక్య మంగ్య నాయక్, లకావత్ రమేష్, చిలుకూరి వెంకటేష్, యాట రవిలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం తుర్కపల్లి పోలిస్ స్టేషన్‌కు తరలించినట్లు తుర్కపల్లి ఎస్సై మహమ్మద్ తక్యుద్దీన్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.9140 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు పేక ముక్కల సెట్లు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా, ఎవ్వరైనా పేకాట ఆడుతూ అసాంఘిక చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే చట్టప్రకారం కేసులు నమోదు, చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# న్యాయవాది స్వప్న అనూష హత్య పట్ల న్యాయవాదుల నిరసన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు, యువ మహిళా న్యాయవాది స్వప్న అనూష హత్య పట్ల మిర్యాలగూడ బార్ అసోసియేషన్ తరుపున తీవ్రంగా ఖండిస్తూ న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. హత్య చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వప్న ఆత్మకు శాంతి చేకూరాలని వారు భగవంతున్ని ప్రార్ధించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతిరెడ్డి, కోశాధికారి గొడ్డటి సాయికుమార్‌యాదవ్, సుదర్శనం రాంబాబు, లింగంపల్లి అంజయ్య, కోడిద సత్యనారాయణ, కర్ణం లింగయ్య, ధూపాటి మట్టయ్య, నరసింహారావు, వేణుగోపాల్, శ్రీదేవి, అలుగుబెల్లి స్వరాజ్యం, రాయారపు భాస్కర్, శీలం వీరేంద్రనాయుడు, కందిబండ శ్రీనివాస్, బాలునాయక్, పెదమాం కిరణ్, రంగారావు, మాతంగి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక



**ప్రజాపక్షం/రామన్నపేట** : ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో బిఏ ప్రథమ సంవత్సరం చదువుచున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ నోముల సాయి తేజ, ఫిబ్రవరి 16 నుండి 22 వరకు, ఏడు రోజులపాటు బీహార్ రాష్ట్రంలోని సస్రాంలో జరిగే జాతీయ సమైఖ్యతా శిబిరానికి ఎంపికైనారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లలో నైపుణ్యాలు పెంచే దిశగా భారత ప్రభుత్వ క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ,ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ పాట్నా ఆధ్వర్యంలో బీహార్ రాష్ట్రం సస్రాంలోని శాంతి ప్రసాద్ జైన్ కాలేజ్‌లో ఫిబ్రవరి 16 నుండి 22 వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి 2026కు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఎంపికకు సంబంధించి కల్చరల్ అంశాలలో ప్రతిభ కనబర్చి జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన సాయి తేజను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జే.చిన్నబాబు, జాతీయ సేవా పథకం యూనిట్ వన్ ప్రోగ్రాం అధికారి తాటిశెట్టి శ్రీనివాసులు తదితర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## ఖోఖోలో మోడల్ స్కూల్ విద్యార్థి మొదటి బహుమతి



**ప్రజాపక్షం/వలిగొండ** : భువనగిరి నియోజకవర్గం సీఎం కప్ 2026లో భాగంగా భువనగిరి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన వలిగొండ పరిధిలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థులకు ఖోఖోలో (బాలురు) మొదటి బహుమతి పొందినట్లు ఫిజికల్ డైరెక్టర్ జి.ఐలయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. వీరిని ప్రిన్సిపల్ రసున్నీ సుబేగం, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.



## గంట్ల అనంతరెడ్డి విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మున్సిపల్ కార్పొరేషన్ 36వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా గంట్ల అనంతరెడ్డి విస్తృాత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ ఆలోచనలు లేని నాకు ప్రముఖ భారతీయ జనతా పార్టీ నాయకులు సంప్రదించి ఇంటికి వచ్చి మీ సేవలు పార్టీకి ఎంతో అవసరం అని నమ్మబలికి ఆధ్యాత్మిక సేవలో ఉన్న నాకు రాజకీయ రంగు పూసి చివరి నిమిషంలో ప్లేటు పిరాయించి ఆదిపత్య రాజకీయం చేశారు.రాజకీయాలకు అతీతంగా అందర్నీ సమన్వయపరచుకొని 20 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సేవలో రుద్రసేన ఆధ్వర్యంలో నల్లగొండ ఐకాన్ శ్రీ ఛాయాసోమేశ్వర స్వామి దేవాలయం అందరి సహకారంతో అభివృద్ధి చేయడం జరిగింది.డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా విడుదల చేసిన మేనిఫెస్టో కచ్చితంగా అమలు చేస్తానని తెలియజేశారు. తన గుర్తు విజిల్ సీరియల్ నెంబర్ 6కు ఓట్లు వేసి గెలిపించాలని కొరారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ



**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని బడాయి గడ్డ ఎంపీ యుపిఎస్ పాఠశాల పీఎం సిరి పథకానికి ఎంపికయింది. ఇందులో భాగంగా సుమారు 11లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇట్టి నిధులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్వినియోగం చేసినట్లు పాఠశాల చైర్మన్ మెగా వత్ బుజ్జి మధు ఇటీవల జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం త్రిపురారం ఎంపీడీవో విజయ్ కుమారి బడాయి గడ్డ పాఠశాలకు వెళ్లి అభివృద్ధి పనులపై విచారణ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం గ్రామస్తుల సమక్షంలో పీఎం సిరి పాఠశాలలలో విచారణ చేసి నివేదికను కలెక్టర్ కి అందజేయు నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని 21వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితన్నీరు మల్లిఖార్జున్‌రావు విజయాన్ని ఆకాంక్షిస్తూ అక్కడి ఓటర్లు ప్రజలు పెద్ద సంఖ్యలో గురువారం ఉదయం 21వ వార్డు ఇన్‌ఛార్జి చలసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గడపగడపకు ప్రచారం నిర్వహించారు. మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇక్కడ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ఓటర్లకు తెలియపరుస్తూ ఉత్సాహంగా కాంగ్రెస్ జెండాలతో బ్యాడ్జిలు ధరించి మెడలో కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పండగ వాతావరణంలో ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్పూర్ గ్రామానికి చెందిన దుబ్బ చుక్కమ్మ అనారోగ్యముతో మరణించారు. వారి కుటుంబ సభ్యులకు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రచారంలో ఆరో వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికలలో కౌన్సిలర్‌గా గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకు పోతున్నారు 6వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి కర్నాటి వరలక్ష్మి నరసింహ గడప గడపకు తిరుగుతూ ఓటర్లను ఆకర్షిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. గురువారం రాంనగర్ పద్మనగర్‌లో పార్టీ యువ నాయకులతో కలిసి వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని వాగ్దానమిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు కర్నాటి అంజమ్మ, వేముల సుమన్ గౌడ్, కర్నాటి విగ్నేశ్వర్, కర్నాటి పాండు, గోలి యాదమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

## గ్యాస్ సేవలు ప్రారంభం

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండలంలోని నూతన గ్రామ పంచాయతీ ఆబిద్ నగర్‌లో సర్పంచ్ నాయిని అమరావతి రామ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు అందించారు. ఈ సందర్భంగా అమరావతి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆబిద్ నగర్, నిమ్మనగర్, హనుమాన్ నగర్, బహదూర్ బావి తదితర గ్రామాల ప్రజలు ఆబిద్ నగర్ నుండి భారత్, ఇండియన్ గ్యాస్ సిలిండర్లను ప్రతి గురువారం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయిరెడ్డి క్రిష్ణా రెడ్డి, వార్డు సభ్యులు సంగు మంజుల, నాయిని జానమ్మ, యగమాటి నర్సిరెడ్డి, సంగు రవీందర్ రెడ్డి, సామ అజంత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 12వ వార్డు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మున్సిపల్ పట్టణంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రచార జోరు పెంచారు. 12వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి మోర్తాల సునీతా రమణా రెడ్డి, వార్డులోని ప్రధాన సమస్యలపై గత హయాంలోనే 1.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతర అభివృద్ధి పనులు చేశామని చేయాల్సిన పనులు ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయని వార్డు అభివృద్ధి కోసం మరోక సారి అవకాశం ఇచ్చి గెలిపించాలని ఓటర్లను కోరారు.

## స్టేషనరీ పంపిణీ

**ప్రజాపక్షం/మర్రిగూడ** :ఖుదాబక్షపల్లి గ్రామంలో బెతెల్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్సిళ్లు,ప్యాడ్లు,నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ ఉప సర్పంచ్ గిరీష్ పార్వతమ్మ, నూతనంగా ఎన్నికైన రెండో వార్డు సభ్యుడు మైలారపు రాజు,ఏడో వార్డు సభ్యుడు మేతరి యాదయ్య, అలాగే సత్తయ్య, సుధాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే ట్యూషన్ టీచర్స్ బూడిద కృష్ణయ్య, బూడిద జ్యోతి పాల్గొన్నారు.

# అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం



**ప్రజాపక్షం/చండూరు** : ఈ నెల11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో చండూరు పట్టణంలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత అన్నారు. చండూరు మున్సిపాలిటీలో అధ్యక్షులు పున్న కైలాస్ నేత ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారు చండూరు అభివృద్ధి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు.ఇప్పటికే చండూరు మున్సిపాలిటీలో డబుల్ రోడ్డు నిర్మాణం, వీధిలైట్లు,డ్రైనేజీ మొత్తం 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి, మరో 15 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అని చెప్పుకొచ్చారు. పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ పార్టీ చేసిందేమి లేదు,అభివృద్ధి శూన్యం అని ఆరోపించారు.బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని సంక్షేమ పథకాలు సన్న బియ్యం, ఉచిత కరెంట్,ఇందిరమ్మ ఇండ్లు ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందుతున్నాయి అని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్,బిజెపికి ఓటు వేస్తే ఇక్కడ అభివృద్ధి ఆగిపోతుంది కావున సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత డెంటల్ హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో ప్రజల దంత ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మాజీ ఎంపీపీ మంచికంటి జనార్ధన్ జ్ఞాపకార్థం, సాయి మంచికంటి మల్టీ స్పెషాలిటీ వారి సౌజన్యంతో డెంటల్ హెల్త్ క్యాంప్‌ను స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ప్రారంభించారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య దృశ్య ఇలాంటి ఉచిత క్యాంపులు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ శిబిరంలో నిపుణులైన దంత వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించి, బీపీ షుగర్, కీళ్లనొప్పులకు సూచనలు చేశారు. గ్రామీణ ప్రజలు, మహిళలు, విద్యార్థులు హాజరై దంత సమస్యలపై వైద్యుల సూచనలు పొందారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వైద్యులు డాక్టర్ మంచికంటి వెంకటేష్, రాజేశ్వరి, గుప్త శశిధర్ రెడ్డి, ఫాల్గుణ కుమార్, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ బిక్కుకు సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ధనావత్ బిక్కును సీఐ జెట్టి సోమనర్సయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. బిక్కు 1992లో కానిస్టేబుల్‌గా జాయిన్ అయి డిపార్ట్‌మెంట్‌కు విశేష సేవలు అందిస్తున్నారు. త్రిపురారం మండలంలోని బుడ్డితండా గ్రామాన్ని దత్తత తీసుకోని సారా రహిత గ్రామంగా మార్చి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా జంకుతండాలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారని, త్రిపురారం, నిడమనూరు మండలాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇలా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బిక్కుకు ఇటీవల సేవా పతకం లభించగా సీఐ సోమన ర్సయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాంబాబు, రమేష్, ఏఎస్ఐ మట్టయ్య, హెడ్ కానిస్టేబుల్ బుచ్చిరెడ్డి, స్వర్ణనాయక్, యాదగిరి రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల విధులపై పోలింగ్ అధికారులకు శిక్షణ

**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీలో జరగను న్న మున్సిపల్‌ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పైలాన్ కాలనీలోని వేమూరి అభి రామేశ్వరరావు ప్రభుత్వ మోడల్ హైస్కూల్, ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సహాయ జిల్లా ఎన్నికల అధికారి, నందికొండ మున్సిపల్ కమిషనర్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొని పోలింగ్ అధికారులు అసిస్టెంట్ పోలింగ్ అధికారుల కు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా టీఓటీ దేవేందర్ ఎన్నికల విధుల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పిస్తూ, పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధానాలు, బాధ్యతలు, జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు.ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.ఈశిక్షణ తరగతుల్లో నందికొండ మున్సిపల్ కమిషనర్ ఏ.అశోక్ రెడ్డి,మండల విద్యాశాఖ అధికారి రాము,టీఓటీ దేవేందర్,పోలింగ్ అధికారులు,అసిస్టెంట్ పోలింగ్ అధికారులు అసిస్టెంట్ పోలింగ్ అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : విద్యార్థులు హాస్టల్లో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ నసీహా తబస్సుమ్ సూచించారు. గురువారం పట్టణంలోని సావర్కర్ నగర్‌లో ఉన్న బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేసి విద్యార్థులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. అనారోగ్యంతో,ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు పరీక్షించి మందులను అందజేశారు. అనంతరం కిచెన్,స్టోర్ రూమ్, వాష్ రూమ్‌ను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శిరీష, ఆశ వర్కర్ శైలజ, హాస్టల్ వార్డెన్ మల్లయ్య, కార్తీక్ రెడ్డి,హాస్టల్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీకి సన్మానం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో సాయి మంచి కంటి సౌజన్యంతో నిర్వహించిన డెంటల్ హెల్త్ క్యాంప్‌కు హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను హెల్త్ క్యాంప్ వైద్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మాజీ ఎంపీపీ మంచికంటి జనార్ధన్ జ్ఞాపకార్థంతో ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు. మంచికంటి జనార్ధన్ ప్రజా ప్రతినిధిగా మండలంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

## యోగా సర్టిఫికెట్ కోర్స్ విజయవంతం



**ప్రజాపక్షం/రామన్నపేట** : స్థానిక రామన్నపేట డిగ్రీ కళాశాలలో యోగా సర్టిఫికెట్ కోర్సును విజయవంతంగా నిర్వహించారు. 30 రోజుల యోగా సర్టిఫికెట్ కోర్సును ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిజిక్స్ విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రవీందర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చిన్నబాబు సమన్వయంతో నిర్వహించారు. ఈ కోర్సులో పాల్గొన్న విద్యార్థులు యోగాలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి, బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రాహత్ ఖానం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ హరికృష్ణ విద్యార్థులతో యోగాసనాలు వేయించి, యోగా ప్రాధాన్యతపై చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకు శివకు నివాళులు



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గురుకుశివ అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారితో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్ట సంతోష్ కుమార్, రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్య నారాయణ, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు జినుకల ప్రభాకర్, వనం చంద్రశేఖర్, గుత్తా నర్సిరెడ్డి, సాల్వేరు అశోక్, గోదాసు పృథ్వీరాజ్, రెహాన్ పాల్గొన్నారు.

## బిసి అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసి అత్యధిక సీట్లు గెలిపించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ గౌడ్‌ని కోరిన యాదాద్రి భువనగిరి జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పరిటాల రవి కుమార్ గౌడ్ అనంతరం మాట్లాడుతూ బీసీలలో ఐక్యత వచ్చే విధంగా అడుగులు వేస్తూ ప్రతి బీసీ బిడ్డను ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించుకునే విధంగా ముందుకు సాగుదామని రవి తెలిపారు.



## బిఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని 3వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి సామ సుజాత యాదవ రెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్లు కలుస్తూ 3వ వార్డు అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/దేవరకొండ;** దివంగత కార్మిక నేత ప్రజల బాంధవుడు హన్మంత్ చంద్రన్న స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయనున్నట్లు దేవరకొండ మున్సిపాలిటి కాంగ్రెస్ పార్టీ 7వ వార్డు అభ్యర్థి హన్మంత్ సాయిచంద్ర గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 7వ వార్డులో గడప గడపకు ముమ్మర ప్రచారం నిర్వహించారు. హన్మంత్ చంద్రన్న స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన నన్ను వార్డు కౌన్సిలర్‌గా హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు.

## చైతన్య విద్యార్థుల విజయకేతనం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత డిసెంబర్ 16న నిర్వమించిన సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల చైతన్య పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.నర్సిరెడ్డి తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన ఆర్.చైత్ర జిల్లా మొదటి ర్యాంకు సాధించగా, పి.జాస్మిత జిల్లా రెండవ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినిలను ఆయన గురువారం అభినందించి మాట్లాడారు. తమ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఐఐటీ ఫౌండేషన్ అనుభవం కలిగిన అధ్యాపకులచే తరగతులు నిర్వహించి విద్యార్థులకు ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు

**ప్రజాపక్షం/మర్రిగూడ :** జలసేవా అంకాలన్ కార్యక్రమంలో భాగంగా అజిలాపూర్ గ్రామం నర్సింహపూర్ గ్రామాలు సందర్శించి విబ్ల్యూఎస్‌సి కమిటీతో సర్పంచ్ రోక్కం భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించి వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుం డా గ్రామంలో మంచినీటి సరఫరా విషయంలో తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలు గురించి తెలుపనైనది. గ్రామంలో జరుగుచున్న మంచి నీటి సరఫరా గురించి గ్రామంలో తిరిగి తెలుసుకోవడం జరిగింది.ఇట్టి సమావేశంలోపంచాయతీ కార్యదర్శి,ఫీల్డ్ అసిస్టెంట్, వార్డ్ మెంబర్లు, గ్రామ, ప్రజలు ఉన్నారు.

## ఫలితాలలో జిల్లా ప్రథమ స్థానంలో ఉంచాలి



**కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పదవ తరగతి వార్షిక ఫలితాలలో సూర్యాపేట జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టల్ సంక్షేమ అధికారులతో 10వ తరగతి జరుగు వార్షిక పరీక్షలు ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్షేమ హాస్టల్లో ప్రభుత్వం మెనూలో మార్పులు చేసి మంచి ఆహారము అందిస్తున్నందు వలన, కాస్మోటిక్ చార్జీలు కూడా పెంచి విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున సంక్షేమ అధికారులు కూడా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచాలన్నారు. మోటివేషన్ క్లాసులు ఏర్పాటు చేయించాలని, ప్రతి హాస్టల్ సంక్షేమ అధికారి విద్యార్థులు చదివే పాఠశాలకు వెళ్లి సబ్జెక్టు టీచర్ లేదా ప్రిన్సిపాల్ ద్వారా ప్రతి విద్యార్థి ఫీడ్‌బ్యాక్ తీసుకొని చదువులలో వెనుకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాసులు, ట్యూటర్ ద్వారా అవసరమైతే గ్రూపు తయారు చేసి గ్రూపు స్టడీ చేయించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో 70 శాతం మార్కులతో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని, ఫలితాల్లో వెనుకబడిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, నరసింహ పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలను చించడం దుశ్చర్య



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ఫ్లెక్సీలను చించడం దుశ్చర్య అని మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాం రెడ్డి అన్నారు. మండలంలోని చీదెళ్ళ గ్రామంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వాముల జాతర సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి చించడం జరిగింది. ఈ ఘటనపై గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చీదెళ్ళ గ్రామంలో చేసిన సేవలను కొనియాడారు. గ్రామంలోని చెరువును నింపిన ఘనత, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సొంత ఖర్చులతో నిర్మించిన ఘనత, గతంలో జాతర సందర్భంగా రూ. 10 లక్షలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి నాయకుడు ఉన్న ఫ్లెక్సీలను చించడం హేయమైన చర్యన్నారు. పార్టీలకతీతంగా రాజకీయాలకు అతీతంగా కొన్ని సంవత్సరాల నుండి జాతర కొనసాగుతుంటే ఈ సంవత్సరం మాత్రం గుర్తు తెలియని దుండగులు గ్రామాన్ని అభివృద్ధి చేసిన వారి ఫ్లెక్సీలను చించడం దర్మార్గమన్నారు. ఈ సమావేశంలో నాయకులు పరెడ్డి సీతారాం రెడ్డి, జూలకంటి వెంకట్‌రెడ్డి, వెన్న సీతారాం రెడ్డి, కీర్తి ఎలమంచయ్య గౌడ్, మోదుగు నర్సిరెడ్డి, కీర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

## వృత్తి విద్యా కళాశాలలకు అధిక నిధులు కేటాయించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వృత్తి విద్యా కళాశాలలకు అధిక నిధులు కేటాయించి,అభివృద్ధి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.గురువారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు చేశారు.ఈసందర్భంగా సంఘం మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వృత్తి విద్యా కళాశాలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వృత్తివిద్య కళాశాలలకు నిధులు కేటాయించకపోవడం వలన నిర్వీర్యం అయిపోతున్నాయని,కళాశాలలో మొత్తం అస్తవ్యస్తంగా తయారు అయ్యాయని వాపోయారు.ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,కోర్సులకు సంబంధించిన అన్ని రకాల మిషన్స్,ల్యాబ్స్,మెటీరియల్ పూర్తిగా ఇవ్వాలని,కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం వలన వారు నిరుత్సాహానికి గురవుతున్నారని, ఆ వృతి విద్య కోర్సు చేసిన విద్యార్థులకు వెంటనే ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని,ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్లో వృత్తి విద్యా కోర్సులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కె సంశుద్ధిన్,వట్టెపు శివ,శ్రీకాంతు,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల వర్షం...అమలులో శూన్యం



**మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్**

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఎన్నికల ముందు ప్రజలకు అడ్డగోలుగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్ర మోసం చేసిందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ మండిపడ్డారు. గురువారం దేవరకొండ మున్సిపాలిటి ఎన్నికల ప్రచారంలో భాగంగా 6, 5, 10 వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ హయాంలోనే దేవరకొండ మున్సిపాలిటి అభివృద్ధి జరిగింది అని ఆయన గుర్తు చేశారు. పట్టణాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు బిల్యానాయక్, కిషన్‌నాయక్, ఆంజనేయులు, పార్టీ అభ్యర్థులు హరిదాస్, "రాజేశ్వరి శ్రీనివాస్, సరిత తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/దేవరకొండ;** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా దేవరకొండ పట్టణంలోని 4వ వార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మహ్మద్ రయిస్ గెలుపు ఆకాంక్షిస్తూ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి, హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం 3వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అంకూరి సుమలత రాజేష్ గెలుపు కోసం విస్తృతంగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ, పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, త్రాగు నీరు, రహదారులు, డ డ్రైనేజి, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, సిపిఐ నాయకులు, యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి పరులకు ఓట్లు వేస్తే ఆగమే



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అవినీతిపరులకు ఓటువేస్తే అంతా ఆగమే అవుతుందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం సూర్యాపేట మున్సిపాలిటిలోని 47, 46, 17, 31, 33, 44, 42, 43, 30 వ వార్డుల్లో ఆ పార్టీ నుండి కౌన్సిలర్లుగా పోటీచేస్తున్న పోలగాని ధనుంజయగౌడ్, పోలోజు మౌనిక, కుంచం మహేశ్వరి, దండ రవి చంద్ర రెడ్డి, దోసకాయల ఫణి నాయుడు, పెద్ది రమాదేవి, చల్లమల్ల నరసింహ, పల్స మహాలక్ష్మి మల్సూర్ గౌడ్, మామిడి లక్ష్మమ్మలను గెలిపించాలని కోరుతూ ఆయన ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, కర్నాటి కిషన్‌లు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యం అభినందనీయం

**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామీణ పేదలకు ఉచిత కంటి ఆపరేషన్ చేయించి కంటి అద్దాలు ఇవ్వడం అభినందనీయమని మండల అభివృద్ధి అధికారి ఆవుల రాములు అన్నారు. మునిపంపుల మాజీ సర్పంచ్ దేవిరెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు దేవి రెడ్డి వీరేందర్ రెడ్డి సహకారంతో గత 60 రోజుల క్రితం ఉచిత కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలుపునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల అభివృద్ధి అధికారి ఆవుల రాములు మాట్లాడుతూ 2000 మందికి కంటి పరీక్షలు ఉపయోగపడడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవిరెడ్డి సావిత్రమ్మ, ఎంపీఓ రఫుల్ అలీ, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, మాజీ సర్పంచ్ కట్ట యాదయ్య, పంచాయతి కార్యదర్శి రచ్చ వేణు, అఖిల పక్ష నాయకులు తాళ్లపల్లి జితేందర్, ఉయ్యాల నర్సింహా, గాదె కృష్ణ, ఎండి నజీర్, పులిపలుపుల నాగార్జున, గ్రామపంచాయతి సిబ్బంది బూడిద మారయ్య, ముత్తయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/మోత్కూర్ :** మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు ఆరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం కాంగ్రెస్ నాయకులు బద్దం నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ ఓబీసీ జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన కృష్ణ, నాగుల సింహాద్రి, బీఆర్ఎస్ నాయకులు చేకూరి నర్సింహ, నాగుల యాదయ్య కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం నాగార్జున రెడ్డి, అర్ధ ప్రతాపరెడ్డి, దేవరపల్లి రంగారెడ్డి, కొణతం మనోజ్ రెడ్డి, నాగుల నరేష్, శ్యామల భీంరెడ్డి, గడ్డం లక్ష్మయ్య, గడ్డం సోమ నర్సయ్య, కందుకూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

## దీవించి గెలిపించండి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుకు బిజెపి పార్టీ బలపరిచిన కౌన్సిలర్‌గా భారీ మెజారిటీతో గెలిపించి వార్డు అభివృద్ధికి సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని పోటీ చేసే అభ్యర్థి శ్రీరామ మంజుల లింగస్వామి యాదవ్ ఓటర్లను కోరారు. గురువారం ఆయన ముక్తాపూర్ గ్రామంలోని ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి బిజెపి పార్టీ సిద్ధాంతాలు దేశం కోసం చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట ఇంచార్జ్ మాజీ మండల అధ్యక్షులు ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుండ్ల రాజు యాదవ్ ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ పరిశీలన

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ భువనగిరి డిఎస్పి బండారి రవీందర్ యాదవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రోజువారి కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో తీసుకోవాల్సిన విషయాలపై సూచనలు చేశారు. పోలీసులు పబ్లిక్‌తో ఏ విధంగా వ్యవహరించాలో కీలక సూచనలు చేశారు. ఈ పరిశీలన రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్సై అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తండ్రి దేశ సేవలో... కూతురు ప్రజా సేవకై...

**46వ వార్డులో బిజెపి అభ్యర్థిగా పోలోజు మౌనిక పోటీ**

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తండ్రి దేశ సేవకై తన కుటుంబాన్ని వీడి శత్రు దేశాలతో పోరాటం చేసి కార్గిల్ యుద్ధంలో పోలోజు గోపయ్య చారి అమరుడయ్యాడు. ఆ వీర జవాన్ ఏకైక వారసురాలైన పోలోజు మౌనిక తన తండ్రి స్ఫూర్తితో ప్రజా సేవకై తొలిసారిగా మున్సిపల్ ఎన్నికల బరిలో 46వ వార్డు నుండి బిజెపి అభ్యర్థిగా నిలిచింది. ఎన్నికల్లో ఎలాగైన గెలిచితీరాలనే సంకల్పంతో తనదైన శైలిలో ముందుకు సాగుతుంది. తండ్రి గోపయ్య చారి దేశం కోసం చేసిన సేవను ఆమె ఓటర్లకు గుర్తు చేస్తుంది. అమరుడైన తన తండ్రి ఆశయ సాధనే తన లక్ష్యమని ఓటర్లకు చెబుతుంది.



## పెండింగ్ పనులను పూర్తికి చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ ,పునరావాస, పునర్నిర్మాణ కేంద్రాల పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాజెక్టుల కింద చేపట్టిన భూసేకరణ, పునరావాస కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. భూసేకరణకు సంబంధించి అవార్డు దశలో ఉన్న సమస్యలను పరిష్కరించి అవార్డు పాస్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు .అవార్డు పాసై నిధుల చెల్లింపు కై పెండింగ్ లో ఉన్నట్లయితే తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా వివరాలను తనకు సమర్పించాలని చెప్పారు.పునరావాస ,పునర్నిర్మాణ కేంద్రాలలో గుర్తించిన పనులన్నింటిని పెండింగ్ లేకుండా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్టీవోలు , భూసేకరణ అధికారులు హాజరయ్యారు.
పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం తన ఛాంబర్ నుండి తహసిల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రెవెన్యూ సంబంధిత కేసుల్లో ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేలా బలమైన కౌంటర్లు దాఖలు చేయాలని, అవసరమైన రికార్డులు సమగ్రంగా కోర్టుకు సమర్పించాలని కలెక్టర్ చెప్పారు. ముఖ్యంగా ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతగా తీసుకుని కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డిఓ రమణా రెడ్డి , ఈడీఎం దుర్గారావు హాజరయ్యారు .

## ఇరిగేషన్ ఎఇపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గుండాల రెవెన్యూ శివారు నూనెగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం. 390 ఎ లో 2.14 గుంటల విస్తీర్ణంతో ఊర కుంట ఉంది. ఈ కుంటకు అనేక సార్లు లక్షలాది రూపాయాలు వెచ్చించి పూడిక మట్టి తీసి కట్టకు మరమ్మతులు చేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు గ్రామాల్లోకి రాకుండా, రోడ్డు కోతకు గురికాకుండా ఈ కట్ట రక్షణగా ఉంటుంది. ఎంతో ప్రాధాన్యత గల ఊరకుంటను ప్రస్తుత నూనెగూడెం గ్రామ సర్పంచ్ భర్త మద్దెపురం పరుశరాములు కొంత మంది వ్యక్తులతో కలిసి అభివృద్ధి పనుల పేరుతో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం కొరకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా కుంటకట్టను తొలగించి, పిల్లర్లు వేస్తున్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ మండల ఇంజనీర్ కు సమాచారం తెలిపిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారు. కుంటకు హద్దులు ఏర్పాటు చేయాలని ఈ విషయంపై బాధ్యతారహితంగా వ్యహరించిన ఇరిగేషన్ ఏఈపై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రమేష్, రాజు, మల్లారెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో... సొంత మేనిఫెస్టో...

**45వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఓటర్లకు అదిరిపోయే హామీలు**



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో 45వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న నరేంద్రుని సత్యలక్ష్మి సోమన్న వార్డు ప్రజలు తనను గెలిపిస్తే సొంత ఖర్చులతో పలు పథకాలు, అభివృద్ధి పనులను చేస్తానంటూ మేనిఫెస్టోను రూపొందించి తన ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. గురువారం ఆయన రామలింగేశ్వర థియేటర్ సమీపంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి మేనిఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు. తన మేనిఫెస్టోలో వార్డులోని ప్రతి ఆడబిడ్డ పెళ్ళి కానుకగా రూ.5,116లు, ఆడబిడ్డకు జన్మనిస్తే రూ.5,116లు ఇస్తానని, అలాగే ఎవరైన మరణిస్తే అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థిక సహాయం, ప్రతి గల్లీకి సిసి కెమెరాలు, వీధిలైట్ల ఏర్పాటు చేస్తానని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. విద్యాభివృద్ధి కోసం పిల్లలకు ఫ్రీగా ట్యూషన్ ఏర్పాటు, మహిళలు ఆర్థికంగా బలపడేందుకు వార్డులో మహిళలకు కుట్టు శిక్షణ సెంటర్ ఏర్పాటు, ప్రతి వినాయక విగ్రహానికి రూ.20వేల విరాళం, ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## హామీలు ఏవి.. అభివృద్ధి ఎక్కడ?’

**ప్రభుత్వ వైఫల్యాలపై ‘శ్వేతపత్రం’ విడుదల చేయాలని డిమాండ్**



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం, తో పాటు గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి మండిపడ్డారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పర్యటించారు. పట్టణంలోని రెండవ మూడవ నాలుగవ ఏడు ఎనిమిది వార్డులలో జరిగిన ప్రచార సభలో వారు పాల్గొని మాట్లాడుతూ అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని నేతలు హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను ముందుకు తీసుకెళ్లడం లేదని నేతలు గుర్తు చేశారు. ప్రభుత్వ ధనాన్ని ‘దండుకోవడం.. పంచుకోవడం‘ పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్. మండల పార్టీ అధ్యక్షుడు కర్ర వెంకటయ్య, అభ్యర్థులు కోలా కావేరివెంకటేష్ పాల్గొన్నారు.



## ఇంటింటి ప్రచారంలో 10వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఇమ్రాన్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 10వ వార్డులో ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతోంది. టిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం పార్టీల బలపాటుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఇమ్రాన్ ప్రజల మధ్య విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ విశేష ఆదరణ పొందుతున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా వినిపిస్తూ, పరిష్కారాలపై స్పష్టమైన హామీలు ఇస్తూ ముందుకు సాగుతున్న ఇమ్రాన్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రచారానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సహాయ కార్యదర్శి చింతల మల్లేష్, సతీష్, రిజ్వాన్, చింటూ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఓటర్లు తనను ఆదరించి గెలిపిస్తే వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని 1వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి రత్నావత్ మౌనిక శివ అన్నారు. గురువారం ఆమె తన భర్త శివతో కలిసి కుడకుడలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలకు బొట్టు పెట్టి స్థానికురాలైన తనకు ఓటువేస్తే నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు.

## పదేళ్ల నిర్లక్ష్యానికి చెక్కు

**ప్రజా పక్షం/మర్రిగూడ:** ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యంతో చీకట్లో మగ్గిన రాంరెడ్డిపల్లి గ్రామానికి మునుగోడు ఎమ్మెల్యే రాజ గోపాల్ రెడ్డి చొరవతో గ్రామ సర్పంచ్ లప్పంగి నరసింహ ఆధ్వర్యంలో గురువారం ప్రజా బాట కార్యక్రమం ద్వారా గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలు సార్లు విన్నవించిన గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యుత్ సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం ప్రజాపాలకు నిదర్శనంగా నిలిచింది.గ్రామాభివృద్ధి నినాదంగా కాకుండా కార్యాచరణగా మార్చి నెలలో సర్పంచి లప్పంగి నరసింహ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులకు మంజూరు చేయించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కారింగు నరసింహ,సీనియర్ నాయకులు వెన్నమనేని సుధాకర్ రావు,దామోదర్ రావు,లైన్మెన్ వెంకన్న పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జనవరి 30వ తేది నుండి ఫిబ్రవరి 13వ తేది వరకు నిర్వహించనున్న కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యూక్లియస్ టీం సభ్యులు డిప్యూటి పారా మెడికల్ ఆఫీసర్లు అనిత, అజ్మీరా రమేష్, మాధవి, రాములు బృందం, మండల పిహెచ్‌సి డా. ప్రవీన్‌కుమార్, సిహెచ్ఓ వెంకటేశం, పిహెచ్ఎన్ వనజకుమారి, సూపర్‌వైజర్ కరుణ, నోడల్ పర్సన్ రవి, ఏఎన్ఎం స్వర్ణలత, ఆశా కార్యకర్తలు సుజాత, ఐలమ్మ, కళమ్మ, రేణుకల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాచిల్ల సర్పంచ్ ఆలంచెట్టి మహేష్, గుండాల సర్పంచ్ దేవరబోయిన ఐలయ్య, పాఠశాల ప్రిన్సిపల్ రాముల, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.